ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 93 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 + https:www.prajarepublic.com + వెల - 1/-
బుధవారం 06 నవంబర్ 2024
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole



GV MALL
shop & celebrate
TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA




## విద్యార్థులకు గుడ్ న్యూస్ .. 'పీఎం-విద్యాలక్ష్మి'కి కేంద్ర క్యాబినెట్ ఆమోదం

**విద్యార్థులకు కేంద్రం గుడ్ న్యూస్ .. చెప్పింది. పీఎం-విద్యాలక్ష్మి పథకానికి కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది.**

**దిల్లీ,నవంబర్, 06 (రిపబ్లిక్ న్యూస్):** విద్యార్థులకు కేంద్రం గుడ్ న్యూస్ .. చెప్పింది. పీఎం-విద్యాలక్ష్మి పథకానికి కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పీఎం-విద్యాలక్ష్మీ పథకం ద్వారా దేశవ్యాప్తంగా 860 విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు కేంద్రం హామీతో రూ.7.50 లక్షల వరకు రుణం లభించనుంది. రుణంలో 75 శాతం వరకు బ్యాంకులకు కేంద్ర ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వనుంది. క్యాబినెట్ నిర్ణయాలను కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడిస్తూ.. ఎఫ్సీఐలో మూలధన



అవసరాలకు రూ.10,700 కోట్లను కేటాయించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు.పీఎం విద్యాలక్ష్మి పథకం ద్వారా ఏటా 22 లక్షల మందికి పైగా ప్రతిభావంతులైన విద్యార్థులకు లబ్ది చేకూరనుంది. ఇది సరళమైన, పారదర్శకమైన స్టూడెంట్ ఫ్రెండ్లీ ప్రక్రియ అని మంత్రి తెలిపారు. రూ.8లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్నవారికి ఈ పథకం వర్తింపజేయనున్నారు. రూ.10లక్షల వరకు రుణాలపై రూ.3శాతం వడ్డీరాయతీ కల్పించనున్నారు. ఏదైనా ప్రభుత్వ స్కాలర్షిప్ లబ్దిదారులు ఈ పథకానికి అనర్హులు. విద్యార్థులు పీఎం విద్యాలక్ష్మి వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

## నెల రోజుల్లో పోలీసు వ్యవస్థను గాడిన పెడదాం: చంద్రబాబు

**నెల రోజుల్లో పోలీసు వ్యవస్థను గాడిన పెడదామని సీఎం చంద్రబాబు మంత్రులతో అన్నారు.**

**అమరావతి,నవంబర్, 06 (రిపబ్లిక్ న్యూస్):** నెల రోజుల్లో పోలీసు వ్యవస్థను గాడిన పెడదామని సీఎం చంద్రబాబు మంత్రులతో అన్నారు. మంత్రివర్గ సమావేశం ముగిసిన తర్వాత రాజకీయ అంశాలపై అమాత్యులతో చంద్రబాబు చర్చించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైకాపా చేస్తున్న సోషల్ మీడియా ప్రచారంపైనా సుదీర్ఘ చర్చ జరిగింది. ప్రభుత్వాన్ని కించపరిచే పోస్టులపై ఉదాసీనత తగదని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మొదటిగా ప్రస్తావించినట్లు తెలిసింది. అసభ్య, అవాస్తవ పోస్టులపై ఫిర్యాదులు వస్తున్నా, కొందరు పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పవన్ కల్యాణ్ అన్నట్లు సమాచారం. జగన్ ప్రభుత్వంలో క్రియాశీలంగా వ్యవహరించిన కొందరు అధికారులే ఇప్పుడు కీలక పదవుల్లో ఉన్నారనే అంశం చర్చకు వచ్చింది. కొంతమంది అధికారుల తీరువల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని మంత్రులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పలు జిల్లాల ఎస్పీలు మంత్రుల ఫోన్లకు సరిగా



స్పందించడం లేదని తెలిసింది. కింది స్థాయిలో డీఎస్పీ, సీఐలపై నెపం నెట్టి.. తప్పించుకుంటున్నారని మంత్రులు చంద్రబాబుకు తెలిపారు. ఈ సమయంలో కలగజేసుకున్న పవన్ కల్యాణ్.. తానూ అందుకే తీవ్రంగా స్పందించాల్సి వచ్చిందన్నారు. గత ప్రభుత్వం నుంచే పోలీసులు ఇలా తయారయ్యారని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలపై ఎప్పటికప్పుడు మాట్లాడుకుంటూ నెల రోజుల్లో వ్యవస్థను గాడిన పెడదామని సీఎం స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో అసత్య పోస్టులను ఇకపై ఉపేక్షించేది లేదన్నారు.

## కేశవాపురం రిజర్వాయర్ కాంట్రాక్టు రద్దు.. జీవో జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

**గోదావరి ఫేజ్-2లో భాగంగా హైదరాబాద్ శివార్లలో గత ప్రభుత్వం తలపెట్టిన కేశవాపురం రిజర్వాయర్ పనులను తెలంగాణ ప్రభుత్వం రద్దు చేసింది.**

**హైదరాబాద్:నవంబర్, 06 (రిపబ్లిక్ న్యూస్):** గోదావరి ఫేజ్-2లో భాగంగా హైదరాబాద్ శివార్లలో గత ప్రభుత్వం తలపెట్టిన కేశవాపురం
రిజర్వాయర్ పనులను తెలంగాణ ప్రభుత్వం రద్దు చేసింది. గోదావరి జలాలను కొండపోచమ్మసాగర్ నుంచి
కేశవాపురం రిజర్వాయర్కు అక్కడి నుంచి తాగునీటి అవసరాల కోసం హైదరాబాద్కు గత ప్రభుత్వం
డిజైన్ చేసిన పనులను నిలిపివేసింది. ఈ కాంట్రాక్టును రద్దు చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్,
అర్బన్ డెవలప్మెంట్ ఇంజినీరింగ్ విభాగం జీవో జారీ చేసింది. ఈ నిర్ణయంతో దాదాపు
రూ.2 వేల కోట్ల ఖర్చు ఆదా అవుతుందని ప్రభుత్వం తెలిపింది. ఆ ఖర- ళ్చతో గోదావరి ఫేజ్- 2
స్కీంను మల్లన్నసాగర్ నుంచి ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాల వరకు
పొడిగించి, గ్రేటర్ సిటీ అవసరాలకు తాగునీటిని అందించేలా ప్రభుత్వం కొత్త ప్రతిపాదనలు
సిద్ధం చేసింది.హైదరాబాద్కు 10 టీఎంసీల తాగు నీటిని సరఫరా చేయటంతోపాటు జంట
జలాశయాలకు 5 టీఎంసీల నీటిని అందించేలా మల్లన్నసాగర్ నుంచి బహుళ ప్రయోజనాలుండేలా 15
టీఎంసీల నీటిని పంపింగ్ చేసే ప్రాజెక్టు పనులకు ఇటీవలే రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. త్వరలోనే ఈ
పనులకు టెండర్లు పిలవాలని జలమండలి అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. పాత టెండర్ల ప్రకారం ఎల్లంపల్లి నుంచి వచ్చే గోదావరి నీళ్లను మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మ సాగర్, అక్కడి నుంచి లిఫ్ట్ చేసి కేశవాపురం చెరువును నింపుతారు. కేశవాపురం చెరువులో 5 టీఎంసీల నీటిని నిల్వ చేసే రిజర్వాయర్గా నిర్మిస్తారు. అక్కడి నుంచి ఘన్పూర్ మీదుగా హైదరాబాదు 10 టీఎంసీల తాగునీటిని అవసరాలకు సరఫరా చేయాల్సి ఉంది. ఆరేళ్లు గడిచినా ఈ పనులు ప్రారంభంకాలేదు.గతప్రభుత్వంలో భూసేకరణ చిక్కులతోపాటు అనాలోచితమైన అలైన్మెంట్ కారణంగా పనులు ముందుకు సాగలేదని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. గత ప్రభుత్వం అటవీ భూములు, రక్షణ శాఖ భూముల నుంచి ప్రాజెక్టును డిజైన్ చేయటం, ఎంచుకున్న పైపులైన్ రూట్ సరిగ్గా లేకపోవటంతో పనులు ముందుకు సాగలేదని ఉత్తర్వుల్లో పేర్కొంది. తక్కువ ఖర్చుతో గ్రేటర్ సిటీకి తాగునీటి సరఫరాతోపాటు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నీటిని నింపేందుకు ఎక్కువ భాగం గ్రావిటీతో వచ్చేలా కొత్త అలైన్మెంట్ ప్రకారం పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## ఇండో-యూఎస్ సంబంధాలు మరింత బలోపేతమవ్వాలి: చంద్రబాబు

**అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్ నకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు తెలిపారు.**


**అమరావతి, నవంబర్, 06 (రిపబ్లిక్ న్యూస్):** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్నకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు తెలిపారు. తమ దేశాన్ని ముందుకు నడిపించే ప్రక్రియలో విజయం సాధించాలని కోరుకుంటున్నట్లు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ట్రంప్ మొదటి పదవీ కాలంలో ఇండో-యూఎస్ సంబంధాలు గణనీయంగా బలోపేతమయ్యాయని చంద్రబాబు గుర్తు చేశారు. ప్రధాని మోదీ, ట్రంప్ నాయకత్వంలో రెండు దేశాల సంబంధాలను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. రెండు దేశాలు పరస్పర సహకారాన్ని పెంపొందింపజేసుకుంటాయని విశ్వసిస్తున్నానని చంద్రబాబు పేర్కొన్నారు.అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అనూహ్య విజయం అందుకున్న



రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓటింగ్లో పాల్గొన్న వారందర్నీ బాలకృష్ణ అభినందించారు.

## కొనసాగుతున్న ఏపీ మంత్రివర్గ సమావేశం

**ఏపీ క్యాబినెట్ సమావేశం కొనసాగుతోంది. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరుగుతున్న భేటీలో పలు కీలక అంశాలపై చర్చిస్తున్నారు.**




**అమరావతి, నవంబర్, 06 (రిపబ్లిక్ న్యూస్):** ఏపీ క్యాబినెట్ సమావేశం కొనసాగుతోంది. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరుగుతున్న భేటీలో పలు కీలక అంశాలపై చర్చిస్తున్నారు. ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ ముసాయిదా బిల్లు, నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు, క్రీడలు, డ్రోన్, సెమీకండక్టర్, డేటా సెంటర్ పాలసీలపై మంత్రివర్గం చర్చిస్తున్నట్లు సమాచారం. ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాను 2 నుంచి 3 శాతానికి పెంపు, ఆర్సెలార్ మిత్తల్ స్టీల్ప్లాంట్ ఏర్పాటుకు భూకేటాయింపుపై క్యాబినెట్ నిర్ణయం తీసుకోనుంది.

## రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు సమగ్ర సర్వే: మంత్రి శ్రీధర్ బాబు

**తెలంగాణలో రాజకీయ, విద్య, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ప్రారంభించామని మంత్రి శ్రీధరాబాబు తెలిపారు..**



**హైదరాబాద్, నవంబర్, 06 (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణలో రాజకీయ, విద్య, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ప్రారంభించామని మంత్రి శ్రీధరాబాబు తెలిపారు. సర్వే ఆధారంగా న్యాయపరంగా హక్కును కల్పించనున్నట్లు చెపాప్రరు. ఈ సర్వేతో రేషన్కార్డులు, ఆరోగ్య శ్రీ కార్డులు పోతాయని అపోహలు చెందుతున్నారని, ఏ కార్డులు పోవని సంక్షేమ పథకాలను అభివృద్ధి చేసేందుకే ఈ సర్వే చేస్తున్నామని మంత్రి వివరించారు. రంగారెడ్డి జిల్లా శంకర్పల్లిలో ఈ సర్వేను మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. సర్వే వివరాల ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తామని మంత్రి తెలిపారు. సర్వేతో రేషన్కార్డులు పోతాయని కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. ఈ మూడు రోజులపాటు మొదటి దఫాగా ఇంటింటికి స్టిక్కర్లు అంటిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో చేవేళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ఇతర అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# తితిదే ఛైర్మన్‌గా బీఆర్ నాయుడు ప్రమాణ స్వీకారం

తితిదే ఛైర్మన్ గా బీఆర్ నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు.
తిరుమలలో ఈవో శ్యామలరావు ఆయనతో ప్రమాణం చేయించారు.



**తిరుమల, నవంబర్, 06 (రిపబ్లిక్ న్యూస్):** తితిదే ఛైర్మన్ గా బీఆర్ నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. బీఆర్ నాయుడు, 16 మంది పాలక మండలి సభ్యులతో ఈవో శ్యామలరావు ప్రమాణం చేయించారు. అనంతరం శ్రీవారిని బీఆర్ నాయుడు దర్శించుకున్నారు. తొలుత తితిదే ఛైర్మన్కు ఆలయ మహాద్వారం వద్ద అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్ నుంచి ఆలయం లోపలికి వెళ్లిన ఆయన.. భూవరాహ స్వామివారిని దర్శించుకున్నారు.

# ఫాంహౌస్ కేసు.. విచారణకు హాజరైన విజయ్ మద్దూరి

మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల స్నేహితుడు విజయ్ మద్దూరి మోకిల పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు.




**హైదరాబాద్, నవంబర్, 06 (రిపబ్లిక్ న్యూస్):** మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల స్నేహితుడు విజయ్ మద్దూరి మోకిల పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. రాజ్ పాకాల ఫామ్ హౌస్ పార్టీ కేసులోఆయన నిందితుడు (ఏ2)గా ఉన్నారు. దీంతో పోలీసులు వివిధ అంశాలపై ఆయన్ను విచారించారు. పార్టీలో డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చాయి? ఎవరు సరఫరా చేశారు? అనే కోణంలో విచారణ కొనసాగింది.

# వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేశకు ఎదురుదెబ్బ

వైకాపాకు చెందిన మాజీ ఎంపీ నందిగం సురేశకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది



**అమరావతి, నవంబర్, 06(రిపబ్లిక్ న్యూస్):** వైకాపాకు చెందిన మాజీ ఎంపీ నందిగం సురేశకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. మరియమ్మ అనే మహిళ హత్య కేసులో ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. తుళ్లూరు మండలం వెలగపూడిలో 2020 డిసెంబర్లో రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. రాళ్లు రువ్వుకున్న ఘటనలో వెలగపూడికి చెందిన మరియమ్మ మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అప్పట్లో తుళ్లూరు ఠాణాలో కేసు నమోదు చేశారు. ఈ కేసులో నందిగం సురేశ్ను పోలీసులు 78వ నిందితుడిగా చేర్చారు. బెయిలు మంజూరు చేయాలని చేసిన అభ్యర్థనను గుంటూరు కోర్టు తోసిపుచ్చడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. సురేశ్ బెయిల్ పిటిషన్ ను కొట్టివేసింది.

# ప్రజాక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం : జనసేన

పల్నాడు జిల్లాలోని సరస్వతీ భూముల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటిస్తే వైకాపా నేతలు ఎందుకు.
మండిపడుతున్నారని జనసేన గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు ప్రశ్నించారు.

**గుంటూరు, నవంబర్, 06 (రిపబ్లిక్ న్యూస్):** పల్నాడు జిల్లా సరస్వతీ భూముల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటిస్తే వైకాపా నేతలు ఎందుకు మండిపడుతున్నారని జనసేన గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. పవర్ ప్లాంట్ పెడతానని, ఈ ప్రాంత వాసులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తానని చెప్పి రైతులను భయపెట్టి మరీ భూములను తీసుకున్నరన్నారు. ఇప్పటివరకూ అక్కడ ఎలాంటి పనులు చేయకుండా వదిలేశారని మండిపడ్డారు. దీనిపై పూర్తి నివేదిక తీసుకొని పవన్ పర్యటనకు వచ్చారని తెలిపారు. ఈ పర్యటనతో వైకాపా మేధావులుగా చెప్పుకొనే అంబటి రాంబాబు, కాసు మహేష్ రెడ్డిలు ఇష్టానుసారం మాట్లాడటం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వంలోని సభ్యుల అభిమతం ఒక్కటేనని.. అది ప్రజాక్షేమమేనన్నారు. కులాలు, మతాల పేరుతో వైకాపా పాలన సాగించిందని, కూటమి ప్రభుత్వం నిజాయతీతో పాలన చేయడమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు.




# వర్రా రవీంద్రారెడ్డిని వదిలేసిన పోలీసులు.. సీఎం, డీజీపీ ఆగ్రహం

వైఎస్సార్ జిల్లా పులివెందులకు చెందిన వైకాపా సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డిని పోలీసులు వదిలేయడంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ గా ఉంది.

**కడప, నవంబర్, 06 (రిపబ్లిక్ న్యూస్):** వైఎస్సార్ జిల్లా పులివెందులకు చెందిన వైకాపా సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డిని పోలీసులు వదిలేయడంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ గా ఉంది. కడప తాలూకా పోలీసులు బుధవారం తెల్లవారుజామున రవీంద్రారెడ్డికి 41-ఏ నోటీసు ఇచ్చి విడిచిపెట్టారు. దీనిపై సీఎం చంద్రబాబు, డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కడపలోని ఎస్పీ కార్యాలయానికి కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ చేరుకుని ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో సమావేశమయ్యారు. వర్రా రవీంద్రారెడ్డి కేసుపై ఆయన ఆరా తీశారు. వైకాపా అధికారంలో ఉండగా వర్రా రవీంద్రారెడ్డి అడ్డూ అదుపూ లేకుండా మితిమీరి ప్రవర్తించారు. చంద్రబాబు, పవన్కల్యాణ్, లోకేశ్, వంగలపూడి అనితపై అసభ్యకరమైన పోస్టులు పెట్టారు. ఆయనపై మంగళగిరి, హైదరాబాద్ పలు కేసులున్నాయి. ఈ క్రమంలో మంగళవారం పులివెందులలో అదుపులోకి తీసుకున్న పోలీసులు.. కడపకు తీసుకొచ్చి రహస్యంగా విచారించారు. అనంతరం బుధవారం 41-ఏ నోటీసు ఇచ్చి పిలిచినప్పుడు విచారణకు హాజరుకావాలంటూ వదిలిపెట్టారు. మరో కేసులో అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు మళ్లీ వెళ్లగా వర్రా రవీంద్రారెడ్డి తప్పించుకున్నారు. ఆయన్ను పట్టుకునేందుకు పోలీసులు యత్నిస్తున్నారు.



# కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సుకు ఎంపీ పురందేశ్వరి

ఆస్ట్రేలియాలో జరుగుతున్న 67వ కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్కు భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి హాజరయ్యారు.



**నవంబర్, 06 (రిపబ్లిక్ న్యూస్):** ఆస్ట్రేలియాలో జరుగుతున్న 67వ కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్కు భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి హాజరయ్యారు. ఈ సదస్సులో చర్చిస్తున్న అంశాలపై ఆమె ఆనందం వ్యక్తంచేశారు. కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) సదస్సు ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ పార్లమెంటరీ దేశాల ప్రతినిధులతో కలిసి జరుపుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ సదస్సులో అర్థవంతమైన చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. మహిళా సాధికారికత కోసం మన ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశంలో చేపడుతున్న సానుకూల, కచ్చితమైన అంశాలను సవివరంగా వివరించడానికి ఈ సదస్సు ద్వారా మంచి అవకాశం దొరికిందని ఆమె పేర్కొన్నారు. 8వ తేదీ వరకు కాన్ఫరెన్స్ లో పాల్గొని, 11న స్వదేశానికి తిరిగి రానున్నారు.

# వైకాపా మాజీ ఎమ్మెల్యే గ్రంథి శ్రీనివాస్ ఇంటిపై ఐటీ దాడులు

వైకాపా నేత, భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇల్లు, కార్యాలయంపై ఆదాయపన్ను శాఖ అధికారులు దాడులు నిర్వహించారు.

**భీమవరం,నవంబర్, 06 (రిపబ్లిక్ న్యూస్):** వైకాపా నేత, భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇల్లు, కార్యాలయంపై ఆదాయపన్ను శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఇంటితో పాటు కృష్ణా జిల్లా నాగాయలంకలోని కార్యాలయం, ఇతర వ్యాపార సముదాయాలపై ఏక కాలంతో సోదాలు జరుగుతున్నాయి. దిల్లీ నుంచి వచ్చిన అధికారులు వివిధ పత్రాలు తనిఖీ చేస్తున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.



# కాంగ్రెస్ రాజకీయ లబ్ధికే కులగణన: ఏలేటి మహేశ్వర్ రెడ్డి

భాజపా కులగణనకు వ్యతిరేకం కాదని ఆ పార్టీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్రెడ్డి తెలిపారు.

**హైదరాబాద్, నవంబర్, 06 (రిపబ్లిక్ న్యూస్):** భాజపా కులగణనకు వ్యతిరేకం కాదని ఆ పార్టీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం కాంగ్రెస్ రాజకీయ లబ్ధి కోసమే కులగణన చేస్తున్నారని ఆయన విమర్శించారు. దీనిపై ప్రభుత్వానికి స్పష్టత ఉందా అని ప్రశ్నించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో ఇచ్చిన 21 హామీలు నెరవేర్చారా? అని నిలదీశారు. వాటిని నెరవేర్చకుండా కులగణన పేరుతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ చేసిన కుటుంబ సర్వేను పబ్లిక్ డొమైన్లో పెట్టకపోవడం వెనక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. "42 శాతం రిజర్వేషన్లు బీసీలకు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు ఎందుకు అమలుచేయడం లేదు? ప్రభుత్వం కోర్టుల పేరు మీద తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. మంత్రి పదవుల్లో ఎంతమంది బీసీలున్నారు? ప్రభుత్వానికి రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేదు. కులగణనపై శ్వేతపత్రం విడుదల చేయాలి. స్థానిక ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కులగణన చేపడుతున్నారా? రూ.20 వేల కోట్ల బీసీ సబ్ ప్లాన్ నిధులను ప్రభుత్వం విడుదల చేయాలి. సమగ్ర సర్వే పేరుతో గతంలో కేసీఆర్ మోసం చేస్తే, కులగణన పేరుతో రేవంత్ సర్కార్ మోసం చేసేందుకు ప్రయత్నం చేస్తోంది. ఇటీవల రాష్ట్రానికి రాహుల్ గాంధీ వచ్చారు. ఆయనకు కులగణన గురించి మాట్లాడే నైతిక హక్కు ఉందా? కుల గణనపై ఓపెన్ డిబేట్కు ముఖ్యమంత్రి సిద్ధమా..? అందులో పాల్గొనేందుకు ఎక్కడికి రమ్మంటారో ఆయన చెప్పాలి" అని ఏలేటి మహేశ్వర్రెడ్డి సవాల్ విసిరారు.



# ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ బిల్లుకు ఏపీ క్యాబినెట్ ఆమోదం




రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం జరిగింది. ఇందులో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

**అమరావతి, నవంబర్, 06 (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం జరిగింది. ఇందులో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ ముసాయిదా బిల్లుకు ఏపీ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఏపీ జీఎస్టీ 2024 చట్ట సవరణ, 2014-18 మధ్య నీరు, చెట్టు పెండింగ్ బిల్లుల చెల్లింపులకు ఆమోదం చెప్పింది. ఎక్సైజ్ చట్ట సవరణ ముసాయిదాకు, కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ లక్ష్యాల సాధనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

# ఉన్నత విద్యావంతులే సైబర్ నేరస్థుల ఉచ్చులో చిక్కుకుంటున్నారు: సీపీ సీవీ ఆనంద్

ఈ సంవత్సరం సైబర్ నేరాలు 24 శాతం పెరిగాయని హైదరాబాద్ నగర సీపీ సీవీ ఆనంద్ తెలిపారు.



**హైదరాబాద్, నవంబర్, 06(రిపబ్లిక్ న్యూస్):** ఈ ఏడాది సైబర్ నేరాలు 24 శాతం పెరిగాయని హైదరాబాద్ నగర సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. హైదరాబాద్లో మంత్రి శ్రీధర్ బాబు హాక్ 2.0 పేరుతో సైబర్ సెక్యూరిటీ సమ్మిట్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీ మాట్లాడారు. రాష్ట్రంలో 36 రకాల సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. ఈ మధ్య కాలంలో డిజిటల్ అరెస్టులు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఉన్నత విద్యావంతులే నేరస్థుల ఉచ్చులో చిక్కుకుని మోసపోతున్నారన్నారు. ఇటీవలే 28 మంది సైబర్ నేరగాళ్లను రాజస్థాన్లో అరెస్టు చేశారని గుర్తుచేశారు. వారంతా దేశ వ్యాప్తంగా 243 కేసుల్లో నిందితులుగా ఉన్నారని చెప్పారు.. 28 కేసులు తెలంగాణలోనే ఉన్నాయన్నారు. "సుదూర ప్రాంతాల్లో కూర్చుని సైబర్ నేరస్థులు నేరాలకు పాల్పడుతున్నారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లి వారిని అరెస్టు చేయడం సవాళ్లతో కూడుకున్న పని. అరెస్టు చేయడానికి వెళ్లిన సమయంలో స్థానికులు దాడులకు పాల్పడుతున్నారు. చాలా సవాళ్ల మధ్య సైబర్ నేరస్థులను తెలంగాణ పోలీసులు పట్టుకువస్తున్నారు. ఈ సంవత్సరం రూ.35.8 కోట్లు బాధితులకు తిరిగి ఇచ్చాం." అని సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ పాల్గొన్నారు.

# భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మామునూర్ ఎయిర్పోర్టు నిర్మాణం: మంత్రి కోమటిరెడ్డి

వరంగల్ లోని మామునూర్ ఎయిర్ పోర్ట్ కోసం భూసేకరణ త్వరితగతిన పూర్తి చేసి.. మూడేళ్లలో విమానాశ్రయాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి అధికారులను ఆదేశించారు.



**హైదరాబాద్, నవంబర్, 06(రిపబ్లిక్ న్యూస్):** వరంగల్ లోని మామునూర్ ఎయిర్ పోర్ట్ కోసం భూసేకరణను త్వరితగతిన పూర్తిచేసి.. మూడేళ్లలో విమానాశ్రయాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి అధికారులను ఆదేశించారు. తాత్కాలిక ఏర్పాట్ల కన్నా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఎయిర్ పోర్ట్ నిర్మాణపనులు పూర్తిచేయాలని సూచించారు. సచివాలయంలోని మంత్రి ఛాంబర్ లో మామునూర్ ఎయిర్ పోర్టై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతీ 15 రోజులకోసారి పనుల పురోగతిపై తాను సమీక్ష చేస్తానని మంత్రి తెలిపారు. విమానాశ్రయాన్ని నిర్మించి వదిలేయకుండా విమానాల రాకపోకలపై దృష్టిపెట్టాలని ఎయిర్ పోర్ట్ అథారిటీ ఉన్నతాధికారులకు సూచించారు. వరంగల్ ఎయిర్ పోర్టు ఉడాన్ పథకంతో అనుసంధానం చేసి ఇతర పెద్ద పట్టణాలతో రాకపోకలకు అనువుగా మార్చాలన్నారు. యునెస్కో సైట్ రామప్ప, భద్రకాళీ, వెయ్యిస్తంభాల దేవాలయం ఇతర కాకతీయ కట్టడాలతోపాటు టెక్స్ టైల్ పార్క్ అవసరాలు, భవిష్యత్ పరిశ్రమలకు అనుగుణంగా ఎయిర్ పోర్ట్ను తీర్చిదిద్దాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి స్వయంగా మామునూర్కు వచ్చి ఎయిర్ పోర్ట్ స్థితిగతులను పరిశీలిస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు.

# చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1860:** అబ్రహం లింకన్ అమెరికా 16వ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.
- **1913:** దక్షిణాఫ్రికాలో భారతీయ గనికార్మికులతో ప్రదర్శన జరపగా, మహాత్మా గాంధీ అరెస్టయ్యాడు. ఆయనకు 9 నెలల జైలుశిక్ష వేశారు.
- **1923:** వారానికి- ఐదు రోజులతో రష్యా ప్రయోగాత్మక కాలమాన పద్ధతిని ప్రవేశపెట్టింది.
- **1937:** భారతీయ రాజకీయ నాయకుడు, మాజీ భారత ఆర్థికమంత్రి యశ్వంత్ సిన్హా జననం. (చిత్రంలో)
- **1941:** నౌఖాలీ ఊచకోత జరిగిన ప్రాంతాల్లో గాంధీజీ పర్యటించారు.
- **1943:** అండమాన్ నికోబార్ దీవులను జపాన్ నేతాజీ సుభాష్ చంద్ర బోస్‌కు అప్పగించింది. ఆయన వాటికి షహీద్, స్వరాజ్య అని నామకరణం చేసాడు.


అబ్రహం లింకన్


మహాత్మా గాంధీ


రష్యా


యశ్వంత్ సిన్హా


గాంధీజీ


చంద్ర బోస్

రిపబ్లిక్ స్పోర్ట్స్

# సఫారీలతో టీ20 సిరీస్.. ఆల్టైమ్ రికార్డుపై కన్నేసిన అర్ష్దీప్ సింగ్

**నవంబర్ 8 నుంచి సౌతాఫ్రికా, భారత్ మధ్య నాలుగు టీ20ల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్లో భారత పేసర్ అర్షదీప్ సింగ్ ఆల్టైమ్ రికార్డు సాధించే అవకాశముంది.**

నవంబర్ 8 నుంచి సౌతాఫ్రికా, భారత్ మధ్య నాలుగు టీ20ల సిరీస్ ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ దర్బన్ వేదికగా జరగనుంది. ఇప్పటికే భారత జట్టు దక్షిణాఫ్రికాకు చేరుకొని ప్రాక్టీస్లో నిమగ్నమైంది. టీమ్ ఇండియాకు సూర్యకుమార్ యాదవ్, సౌతాఫ్రికాకు మారమ్లు కెప్టెన్లుగా వ్యవహరించనున్నారు. ఈ సిరీస్లో భారత పేసర్ అర్ష్ దీప్ సింగ్ ఆల్టైమ్ రికార్డు సాధించే అవకాశముంది. టీ20ల్లో ఒక క్యాలెండర్ ఇయర్లో అత్యధిక వికెట్లు పడగొట్టిన రికార్డు ప్రస్తుతం భువనేశ్వర్ కుమార్




పేరిట ఉంది. భువీ 2022 లో 32 మ్యాచ్లు ఆడి 6.98 ఎకానమీతో 37 వికెట్లు తీశాడు. అర్షదీప్ ఈ ఏడాది ఇప్పటివరకు 14 మ్యాచ్లు ఆడి 7.14 ఎకానమీతో 28 వికెట్లు పడగొట్టాడు. గత టీ20 ప్రపంచకప్లో అమెరికాతో జరిగిన మ్యాచ్లో 9 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు దక్కించుకున్నాడు. సఫారీలతో సిరీస్లో అర్ష్ 10 లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు సాధిస్తే భారత్ తరఫున టీ20ల్లో ఎక్కువ వికెట్లు పడగొట్టిన బౌలర్గానూ రికార్డుల్లోకెక్కుతాడు. ప్రస్తుతం ఈ జాబితాలో యుజ్వేంద్ర చాహల్ (96) అగ్రస్థానంలో ఉన్నాడు. భారత జట్టు: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), తిలక్ వర్మ, రింకు సింగ్, అభిషేక్ శర్మ, హార్దిక్ పాండ్య, రమణ్ దీప్ సింగ్, అక్షర్ పటేల్, సంజు శాంసన్, జితేశ్ శర్మ, రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, విజయ్కుమార్ వైశాఖ్, అర్ష్ దీప్ సింగ్, యశ్ దయాళ్, అవేశ్ ఖాన్.

దక్షిణాఫ్రికా జట్టు: మార్క్రమ్ (కెప్టెన్), బార్ట్మన్, కొయెట్జీ, డొనోవన్ ఫెరీరా, రీజా హెండ్రిక్స్, మార్కో యాన్సెన్, హెన్రిచ్ క్లాసెన్, పాట్రిక్ క్రగర్, కేశవ్ మహరాజ్, డేవిడ్ మిల్లర్, మిలాలి ఎంపొంగ్వానా, ఎంకాబా పీటర్, రికల్టన్, సైమేన్, సిపామ్లా, స్టబ్స్,

# 17 ఏళ్ల వయసులోనే నా గుండె బద్దలైంది: శివకార్తికేయన్

17 ఏళ్ల వయసులోనే తన తండ్రి దూరమైనట్లు శివకార్తికేయన్ చెప్పారు. అప్పటినుంచి ఆయన జ్ఞాపకాలతోనే జీవిస్తున్నట్లు తెలిపారు.



'అమరన్'తో మంచి విజయాన్ని అందుకున్నారు హీరో శివకార్తికేయన్ ముకుంద్ వరదరాజన్ పాత్రలో జీవించి ప్రేక్షకుల హృదయాలను హత్తుకున్నారు. ఈసినిమా విజయోత్సవ సభలో తన తండ్రిని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. తన తండ్రి మరణం తర్వాత తాను ఎన్నో బాధలు పడినట్లు చెప్పారు.'మా నాన్న నిజాయతీ గల పోలీస్ అధికారి. అందరూ ఆయన్ని గౌరవించేవారు. నేను ఈ సినిమా చేయడానికి ప్రధాన కారణం ఆయనే. గత 21 ఏళ్లుగా నేను ఆయన జ్ఞాపకాలతోనే జీవిస్తున్నాను. అమరన్లో నేను మా నాన్నను చూసుకున్నాను. ఆయన నా మొదటి హీరో. నేను ఆయన షూ పాలిష్ చేయడం, బ్యాడ్జీ సిద్ధం చేయడం చేస్తుండేవాడిని. 'అమరన్'లో ఆయనలానే నటించాను. మేజర్ ముకుంద్కు, మా నాన్నకు మధ్య చాలా పోలికలు ఉన్నాయి. నాకు 17 ఏళ్లు ఉన్నప్పుడు మా నాన్న మరణించారు. 2 రోజుల్లో ఇంటికి వస్తానని చెప్పిన ఆయన.. అంబులెన్స్లో ఐస్ బాక్స్లో వచ్చారు. అంత్యక్రియలు అయిపోయాక కేవలం ఆయన ఎముకలు మాత్రమే మిగిలాయి. వాటిని చూసి నా గుండె బద్దలైంది' అంటూ భావోద్వేగానికి గురయ్యారు.రాజ్కుమార్ పెరియసామి దర్శకత్వంలో తెరకెక్కిన 'అమరన్' విజయాన్ని సాధించి మంచి వసూళ్లను సొంతం చేసుకుంటోంది. ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్లు దాటేసిన ఈ చిత్రం తాజాగా ఇండియాలో రూ.100కోట్ల క్లబ్లో చేరింది. మరోవైపు ఈ సినిమా పై ప్రముఖుల ప్రశంసలు ఆగడం లేదు. కథానాయకుడు రజనీకాంత్ ఈ చిత్రాన్ని వీక్షించి.. దీన్ని నిర్మించిన కమలక్కు ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. అద్భుతమైన చిత్రాన్ని నిర్మించారని ప్రశంసలు కురిపించారు. అలాగే తనని ప్రత్యేకంగా కలిసిన శివ కార్తికేయన్, దర్శకుడు రాజ్కుమార్లతో పాటు చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

# ఆ సమయంలో చనిపోతాననుకున్నా: మనీషా కొయిరాలా

క్యాన్సరు చికిత్స తీసుకున్న రోజులను నటి మనీషా కొయిరాలా తాజాగా గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో తాను భరించలేని నొప్పిని అనుభవించినట్లు చెప్పారు.

సూర్య హీరోగా శివ దర్శకత్వంలో రానున్న చిత్రం 'కంగువా' అత్యంత భారీ బడ్జెట్తో రూపొందిన ఈ సినిమా నవంబర్ 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా దీని రిలీజ్ గురించి నిర్మాత ధనుంజయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దీన్ని భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా ఏకంగా 10వేల స్క్రీన్స్లో దీన్ని ప్రదర్శించనున్నట్లు తెలిపారు. 'ఈ చిత్రం విడుదల కోసం ఆడియన్స్తో పాటు మేము కూడా ఆసక్తిగా ఎదురుచూస-త్తున్నాం. దీన్ని 10వేల స్క్రీన్స్లో



ప్రదర్శించనున్నాం. వీటిలో చాలా స్క్రీన్లు ఇప్పటికే కన్ఫామ్ అయ్యాయి. దక్షిణాదిలో 2500 కంటే ఎక్కువ స్క్రీన్లు, ఉత్తరాదిలో 3,500 స్క్రీన్లలో ప్రదర్శించనున్నామని చెప్పడానికి ఎంతో గర్వపడుతున్నాం. నవంబర్ 14న మొత్తం 10 వేల స్క్రీన్లలో భారీస్థాయిలో కంగువా ప్రేక్షకుల ముందుకురానుంది' అని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగాఈ చిత్రం రూ.1000 కోట్ల కలెక్షన్స్ చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు నిర్మాత ఇటీవల చెప్పారు. పార్ట్ 2, పార్ట్ 3 కథలు కూడాసిద్ధంగా ఉన్నాయని.. పార్ట్ 1 విజయం ఆధారంగా వాటిని తెరకెక్కించేలా ప్లాన్ చేయనున్నట్లు తెలిపారు. ఈ సినిమా సూర్యని మరో స్థాయికి తీసుకెళ్తుందని నమ్ముతున్నట్లు చెప్పారు.యాక్షన్తోపాటు ఎమోషన్స్కు ఇందులో అధిక ప్రాధాన్యం ఉందన్నారు. ఇక ఈ చిత్రం త్రీడీలోనూఅలరించనున్న విషయం తెలిసిందే. ఇందులో సూర్య ఆరు భిన్నమైనఅవతారాల్లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. దిశా పటానీ కథానాయిక. బాబీ దేవోల్ ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. జగపతిబాబు, యోగిబాబు, కోవై సరళ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు.అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ తెరకెక్కిస్తున్న చిత్రం 'పుష్ప: ది రూల్ పుష్ప ది రైజ్కు సీక్వెల్గా రానున్న ఈ చిత్రం కూడా భారీస్థాయిలో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ఇటీవల స్పష్టంచేశారు. ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా 11,500 స్క్రీన్స్లో విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఇండియాలో 6,500.. ఓవర్సీస్లో 5,000 స్క్రీన్స్లో దీన్ని ప్రేక్షకుల ముందుకుతీసుకురానున్నట్లు చెప్పారు.

## ఆరోగ్యం

# ఇంటి పెరట్లో పెరిగే ఈ చెట్టు ఆకులతో యూరిక్ యాసిడ్ తగ్గుతుంది.. ఇంకా ఎన్నో లాభాలు..





ప్రస్తుత బిజీ లైఫ్‌స్టైల్, ఆహారపు అలవాట్ల కారణంగా చాలా మంది వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. అయితే, ఎక్కువ మందిలో యూరిక్ యాసిడ్ సమస్య తీవ్రంగా కనిపిస్తుంది. ఆహారం, తాగే డ్రింక్స్‌లో ఉండే ప్యూరిన్స్ అనే ర-సాయనాల్ని శరీరం విచ్ఛిన్నం చేసినప్పుడు యూరిక్ యాసిడ్ ఏర్పడుతుంది. ఎలా పడితే అలా తినడం, జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం ఇవన్నీ రక్తంలో యూరిక్ యాసిడ్ స్థాయిని పెంచుతున్నాయి. యూరిక్ యాసిడ్ పెరగడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతాయి. ఈ వ్యాధి ప్రధాన లక్షణాల్లో కీళ్ల నొప్పులు ముందు వరుసలో ఉంటుంది. యూరిక్ యాసిడ్ స్థాయి 7.0 కంటే ఎక్కువగా ఉన్నప్పుడు అది కీళ్లలో స్ఫటికాల రూపంలో పేరుకుపోతుంది. దీంతో కీళ్లల్లో నొప్పి, వాపు కలుగుతుంది. అయితే, యూరిక్ యాసిడ్‌ని కంట్రోల్ చేసుకునేందుకు చాలా మంది మందులు వాడుతున్నారు. అంతేకాకుండా ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఇవి ఖర-్చుతో కూడుకున్న పనులు. అయితే, యూరిక్ యాసిడ్‌ను కొన్నిసహజ నివారణల ద్వారా నియంత్రించవచ్చు. ఈ ఇంటి నివారణల్లో ఒకటి వేప ఆకులను ఉపయోగించడం. వేప ఆకులు వాటి ఔషధ గుణాలకు ప్రసిద్ధి. వేప ఆకుల్ని ఆయుర్వేదంలో అనేక వ్యాధుల చికిత్సకు ఉపయోగిస్తారు. యూరిక్ యాసిడ్ నియంత్రణకు వేప ఆకు దివ్యౌషధం కంటే తక్కువ కాదు. వేప ఆకుల్ని యూరిక్ యాసిడ్ కంట్రోల్ చేయడానికి ఎలా వాడాలో ఇక్కడ తెలుసుకుందాం



### వేప ఆకుల రసం



యూరిక్ యాసిడ్ నియంత్రణకు వేప ఆకుల రసం అద్భుతంగా పనిచేస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఇందుకోసం ముందుగా తాజా వేప ఆకుల్ని కడిగి మెత్తగా చేసి రసం తీయాలి. ఈ రసాన్ని రోజుకు ఒకసారి ఉదయం ఖాళీ కడుపుతో తాగడం వల్ల ప్రయోజనం ఉంటుంది. వేప యొక్క చేదు రుచి యూరిక్ యాసిడ్ సా-్థయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా శరీరాన్ని నిర్విషీకరణ చేస్తుంది. వేప ఆకుల రసాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల యూరిక్ యాసిడ్ తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.

### వేప టీ..



యూరిక్ యాసిడ్ నియంత్రణకు వేప టీ కూడా మంచి మార్గం. ఇందుకోసం.. కొన్ని వేప ఆకులను నీటిలో మరిగించి, వడకట్టండి. ఆ తర్వాత ఈ నీటిని వేడి వేడిగా టీలా తాగండి. రోజుకు ఒకసారి దీన్ని ట్రై చేయండి. ఈ టీలో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఈ టీ కీళ్ల వాపు, నొప్పిని తగ్గించడంలో సాయపడుతుంది.

### వేప ఆకుల పొడి



వేప ఆకుల పొడి కూడా యూరిక్ యాసిడ్ కంట్రోల్‌కి బెస్ట్ ఆప్షన్. ఇందుకోసం ఎండు వేప ఆకులను గ్రైండ్ చేసి పొడి చేసుకోవాలి. ఈ పొడిని రోజూ తినండి. దీనిని గోరువెచ్చని నీటితో లేదా తేనెతో కలిపి తీసుకోవచ్చు. ఈ రెమెడీ శరీరంలోని యూరిక్ యాసిడ్ స్ఫటికాలను కరిగించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా శరీరంలోని యూరిక్ యాసిడ్ స్థాయిని నియంత్రిస్తుంది.

### వేప పేస్ట్, నూనె



వేప ఆకులను పేస్ట్ చేసి, ప్రభావితమైన కీళ్లపై పూయడం వల్ల వాపు, నొప్పి నుంచి ఉపశమనం పొందవచ్చు. ఇది కాకుండా, వేప నూనెను ప్రభావిత ప్రాంతాల్లో మసాజ్ చేయడానికి కూడా ఉపయోగించవచ్చు. ఈ రెమెడీ యూరిక్ యాసిడ్ లక్షణాలను తగ్గించడంలో సహాయపడటమే కాకుండా చర్మానికి కూడా మేలు చేస్తుందని ఆయుర్వేదం చెబుతుంది.

### వేప ఆకులతో ఇతర ఆరోగ్య ప్రయోజనాలు..



వేప ఆకులలో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి శరీరంలోని అనేక సమస్యలను తొలగించడంలో సహాయపడతాయి. వేప ఆకులు రక్తాన్ని శుద్ధి చేయడం, రోగనిరోధక శక్తిని పెంచడం, చర్మ సమస్యలను నయం చేయడంలో సహాయపడతాయి. వేప ఆకుల్లో విటమిన్లు, ఖనిజాలు ఉన్నాయి. ఇవి జలుబు, దగ్గును నయం చేయడంలో సాయపడతాయి. వేప ఆకులు శరీరం నుంచి ఫ్రీ రాడికల్స్ నుంచి తొలగించడంలో ఉపయోగపడతాయి. ఇలా చెప్పుకుంటే పోతే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు వేప ఆకుల్లో ఉన్నాయి.

### ఈ జాగ్రత్తలు తప్పనిసరి..



గర్భిణీ స్త్రీలు, పిల్లలు వైద్యుడి సలహా లేకుండా వేప ఆకుల్ని తీసుకోకూడదు. వేప ఆకుల్ని అధిక పరిమాణంలో తీసుకోవడం వల్ల కడుపు సమస్యలు లేదా బలహీనత ఏర్పడవచ్చు. అందుకే నిపుణులు సూచించిన మోతాదులో తీసుకోవడం ఉత్తమం. అంతేకాకుండా మీరు ఏ చిక్సితకైనా మందులు వాడుతున్నట్లయితే.. వేప ఆకుల్ని తీసుకునే ముందు వైద్యుణ్ని సంప్రదించండి. గమనిక..ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.